# ఉత్తరాల వర్షం

మహర్షి

అయ్యా ప్రధానమంత్రి గారూ! నేనీ జాబ్ చేయలేనండి. నన్ను ఏ దిక్కుమాలిన రాష్ట్రానికైనా ట్రాన్స్‌ఫర్ వేయండి మహా ప్రభూ. ఇంతకాలం మీకు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ చిన్న ఉపకారం చేసి పుణ్యం మూటకట్టుకోండి'' ప్రధాని మంత్రి పోస్ట్‌మాన్ లబలబా మొత్తుకుని, వల వల ఏడ్చి, గబ గబగా చెప్పాడు వగరుస్తు.

ప్రధాని చిన్నగా కదిలి చిరునవ్వు చిందుస్తూ ప్రేమగా పోస్ట్‌మాన్ తల సవరిస్తూ ''ఛీ. నీ తలంతా మంద్రదు'' అని వేయి వెనక్కి లాక్కుని ''ఇప్పుడు నీకొచ్చిన కష్టమేమిటి?'' అన్నారు.

''అయ్యో! నా కష్టము ఎంతని చెప్పను. ఎన్నని చెప్పను. ఎలా చెప్పమంటారు?'' వెక్కిళ్ళు వెక్కుతూ, కన్నీరు కారుస్తూ అన్నాడు.

''ఎంతవుంటే అంత, ఎన్ని వుంటే అన్ని, ఎలా వీలైతే అలా చెప్పుము. మంచి మూడ్‌లో వున్నాను. మూడ్ చెడిందంటే నా సంగతి తెలుసు కదా!'' అన్నారు ప్రధాని.

''గత మూడు రోజులుగా ముసురు పట్టి కురుస్తున్న వర్షంలా మీ స్వంత రాష్ట్రం నుండి లక్షల్లో వున్న ఉత్తరాలను మోయలేక చస్తున్నాను. ముప్పైసంవత్సరాల వయసుదాటని నాకు నడుం వంగిపోయింది. వాటిని చదివి చదివీ కళ్ళ చూపు తగ్గింది. ఇంతకన్నా బాధలు ఎవరికి మాత్రం వుంటాయి చెప్పండి''. దిగులు దిగులుగా, గుబులు గుబులుగా చెప్పాడు పోస్ట్‌మాన్.

''నాకు అన్నన్ని లెటర్లు వస్తున్నాయని కుళ్ళు. మరీ అంత ఉడుకు మోత్తనం మంచిది కాదోయ్!'' అంటు లేచి పోస్ట్ మాన్‌కు కితకితలు పెట్టారు ప్రధాని.

0000

''రాష్ట్రపతిగారా? నమస్కారమండి. నేను మిమ్మల్ని అర్జంటుగా కలవాలి''అన్నారు ప్రధాని.

''నేను కూడ మిమ్మల్ని అర్జంటుగా కలవాలి'' అన్నాడు రాష్ట్రపతి.

''మరీ అంత అర్జంటు పనా?''

''మీక్కూడా అర్జంటు పనేనా?'' అన్నారు రాష్ట్రపతి.

''సరిసరి. నన్ను రమ్మంటారా లేక మీరే వస్తారా?'' ప్రధాని అడిగారు.

''నేను కదలలేను బాబూ! మీరే వస్తే బాగుంటుంది''

0000

''నమస్కారం ప్రధానిగారూ!'' రాష్ట్రపతి ఎదురొచ్చి గౌరవంగా లోపలకు దారి తీశారు.

''ఎన్నిసార్లని నమస్కారాలు పెడుతారు? మీరెంత భక్తులయితే మాత్రం ఫోన్ చేసినప్పుడల్లా కనిపించినప్పుడల్లా ఇలా నమస్కారాలు పెట్టడం ఏం బాగోలేదు'' ప్రధాని కాస్త రుసరుసలాడారు.

''మీరు మరీ యింత యిదైపోకండి. మీలో సాక్షాత్తు ఫలానా దేవుడు కనిపిస్తున్నారు. అందుకే అలా! ఇలా కూర్చుని మీరు కొంచెం శాంతించాలి. అసలే మనది శాంతి దేశం. అందుకే కదా మనం ప్రతిసారీ తెల్లని పావురాల్ని ఎగరేస్తాం!'' మెల్లగా నవ్వుతూ అన్నారు రాష్ట్రపతి.

''సరిసరి. మనమంతా కలుసుకున్నామని ప్రెస్ వాళ్ళకు తెలిసిందంటే ఏదేదో ఊహించి మరీ రాస్తారు. నాతో అర్జంటుగా మాట్లడాలని చెప్పారు ఏమిటో త్వరగా చెప్పండి. అవతల నా కర్జంటు పని వుంది త్వరగా చెప్పండి'' అన్నారు ప్రధాని

''అదేమిటండి. మీరేకదా ఫోన్ చేసి అర్జంటుగా మాట్లాడలని చెప్పారు. అయినా నాకు మాత్రం పనులేం లేవనుకున్నారా? నేను ఫలానా దేవుడిని దర్శించుకుని, ఫలానా పుణ్యతీర్థం చూడాలని వుందనుకున్నారా?'' అన్నారు రాష్ట్రపతి.

''ఒ.కే. నేనే ఫోన్ చేశాను. కానీ మీకు అర్జంటు పని అన్నారు కదా! అదీ కాకుండా ఈ దేశానికి ప్రథమ పౌరులు, నాకంటే పెద్ద వారూ మీరే కదా! కాబట్టి ముందు మీరేచెప్పండి'' అన్నారు ప్రదాని.

అబ్బే నా వయసు మీకంటే ఏం ఎక్కువ కాదు. మొన్ననే డెబ్బైలో పడ్డానంతే. సరే విషయం చెప్పేస్తున్నాను. నాకసలే నోటిలో మాట దాగదు. ఆంధ్రప్రదేశ్ నుండి, అందులోనూ హైదరాబాద్ నుండి మూడు లక్షల మంది ఆడవాళ్ళు ఉత్తరాలు రాశారు' అన్నారు రాష్ట్రపతి నవ్వుతూ.

''ఛీ. పాడు మీరసలే పరమ భక్తులు. అవ్వ. ఈ వయసులో మీకిలాంటి ఆలోచనల్లేమిటి? మీ భార్యకి తెలిస్తే ఇంకేమైనా వుందా? దేశాన్ని పాలించే మీకిలాంటి బుద్ధులున్నాయని ఎవరైనా వింటే పరువుపోతుంది'' బుర్ర సవరతీసుకుంటూ అన్నారు ప్రధాని.

''హు. నాకు లక్షల్లో ఉత్తరాలొచ్చాయని మీకు అసూయ. విని సంతోషిస్తారని మిమ్మల్ని రమ్మన్నాను. ఇంతకు నన్ను ఎందుకు అర్జంటుగా కలవాలనుకున్నారో చెప్పండి'' ఇబ్బందిగా ఫీలవుతూ అన్నారు రాష్ట్రపతి.

''మీరు మరీ అలా ఫీలవకండి. నాకు గత మూడు రోజులనుండి సుమారు అయిదు లక్షల వరకు ఉత్తరాలు వచ్చాయి. ఆ విషయం చెబుదామని వచ్చాను. నా పోస్ట్ మాన్ మోయలేక దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తున్నాడు'' అన్నారు ప్రధాని మీసం మెలేయబోయి లేదని గుర్తుకొచ్చి ముక్కు నలుపుకున్నారు.

ఇద్దరూ ఆశ్చర్యంగా, అమితాశ్చర్యంగా, మహాశ్చర్యంగా వచ్చిన కొన్ని ఉత్తరాలను పరిశీలించారు. ఆ ఉత్తరాల సారాంశం అన్నీ ఒక్కటే.

గౌరవనీయులైన రాష్ట్రమంత్రి ప్రధాని గార్లకు నమస్కారములు.

మీరు అనేక వాగ్దానాలు చేసి ఎన్నికలలో గెలిచి, చేసిన వాగ్దానాలను మరచిపోయినా భరిస్తున్నాం. బడ్జెట్‌కు ముందే అన్నిటి రేట్లు పెంచి, బడ్జెట్‌లో ఏమి పెంచలేదని చెబుతూనే మళ్లీ పెంచి మా నడుం విరగొట్టినా సహిస్తున్నాం. మమ్మల్ని ఎన్ని రకాలుగా బాధించాలో అన్ని రకాలా బాధించినా

# హాస్యం హాస్యం

కుక్కిన పేనుల్లా జీవచ్ఛవాల్లా విరిగిన నడుముతో నడవలేక కష్ర సాయంతో నడుస్తున్న మమ్మల్ని ఆదుకునే నాథుడు లేడు. మీరు కాల్చే మొసలి కన్నీరు చూసి కూడా సహనం వహించాం. అయినా మాకు బాధలు తప్పడంలేదు. మీ నుండి మేమేం ఆశించడంలేదు. రేట్లు తగ్గించమని అడగడంలేదు. ప్రపంచ బ్యాంకు నుండి అప్పు తీసుకోవద్దని సలహాలివ్వడంలేదు. మిమ్మల్ని స్విష్‌బ్యాంకులో ఖాతాలు తెరుమకోవద్దని చెప్పడంలేదు.

అలా అని ద్రోలకు, హంతకులకు, నరరూప రాక్షసులకు మీ పార్టీలో సీటు ఇవ్వ వద్దని కోరడంలేదుమనదేశంలోని రాష్ట్రాలను ఒక్కొక్క దేశానికి తాకట్టు పెట్టవద్దనడం లేదు. మీరు ఎన్ని చేసినా భరిస్తాంసహిస్తాం. అనుభవిస్తాం. కానీ మీరిద్దరూ నెలకొక్కరు చొప్పున హైదరాబాద్ కొచ్చి ఎయిర్ పోర్ట్‌లో దిగి రాజభవన్ కొచ్చి చర్చలు జరిపి అటు నుండి అటే ఢిల్లీ వెళ్ళక హైదరాబాద్‌లోని ప్రతి వీధిని టాప్‌లెస్ కారులో తిరిగి (మమ్మల్ని పలుకరించనవసరంలేదు) వెళితే మాకెంతో ఆనందం. ఈ విధంగా చేస్తూ మీరు ఈ దేశాన్ని ఏం చేసినా మాకభ్యంతరం లేదుకాబట్టి మీరు మాకోసం ఏం చేయరని తెలిసింది. కనీసం ఈ పనిచేసి మా కోరిక నెరవేర్చ గలరని ఆశతో ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురు చూస్తుంటాం.

ఇట్లు

మీచే బాధింపబడే ప్రజలు

చదివిన ఇద్దరు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఎంత ఆలోచించినా ప్రజలు ఎందుకు రమ్మన్నారో అర్థంకాలేదు.

"ఏమైతే అయింది ఈ దెబ్బతో పోస్టల్ డిపార్ట్‌మెంటుకు విపరీతమైన లాభాలు వస్తాయి. ఈసారి బడ్జెట్‌లో వాటి రేట్లు పెంచకుండా వచ్చే ఎన్నికలలో దాన్ని ఆయుధంగా వాడుకోవచ్చు" ప్రధాని ఆనందంగా చప్పట్లు చరిచారు.


ఆయన ఆనందం చూసిన బాడీగార్డు గభగబా చంకలు గుద్దుకున్నాడు. అతన్ని చూసి రాష్ట్రపతి బాడీ గార్డు తనేం తక్కువ తిన్నానా అని మరింతగా చంకలు గుద్దుకున్నాడు.

"నువ్వెందుకలా చంకలు పగిలిపోయేలా గుద్దుకుంటావ్. నాకసలే గుండె వీక్‌గా వున్నది" అన్నారు రాష్ట్రపతి కోపంగా చూస్తూ.

"ప్రధాని బాడీ గార్డు అలా గుద్దుకుంటూంటే నాక్కూడా గుద్దుకోవాలిపించి అలా గుద్దుకున్నాను అలా గుద్దుకుంటే భలే వింతగా, హాయిగా వుంది" అన్నాడతను పళ్ళు బయటకు యికిలిస్తు.

"సరిసరి. అది ఆయన పార్టీ పైకి రావడానికి మంచి అయిడియా తట్టి అలా అన్నారు. నువ్వలా గుద్దు కుంటుంటే ప్రతిపక్షం వాళ్ళు ఆడిపోసుకుంటారునీది చంకలు గుద్దుకునే జాబ్ కాదు. తుపాకి పట్టుకునే జాబ్ అని గుర్తుంచుకో" అన్నారు రాష్ట్రపతి.

ఇద్దరికీ ఏం చేయాలో అర్థంకాక ఓ నలుగురు పరిశీలక బృందాన్ని సీక్రెట్‌గా విషయం తెలుసుకు రమ్మని హైదరాబాద్ పంపి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నారు. అలా ఊపిరి పీల్చుకున్న తరువాత బాడీ గార్డులిద్దరూ ఆనందంగా చంకలు గుద్దుకోబోయి




ఆగిపోయి ఒకరి మొహాలు ఒకరు చూసుకుని నవ్వుకున్నారు.

0 0 0 0 0

పరిశీలక బృందం ఆనందంగా గంతులేసుకుంటూ హైదరాబాద్ చేరుకున్నదిఎంచక్కా తిని, తాగి తందనాలు ఆడుకోవచ్చునని వారి ఆశ. నాలుగు రోజులు ముఖ్యమంత్రితో చర్చించారు. ఆయన వెర్రి మొహం వేసి వింతగా చూశారు.

"లక్షలకు లక్షలు ఉత్తరాలు రాసిన వాళ్ళు ఒక్కసారి పీపాలకు పీపాలు సారా తాగితే బోల్డంత డబ్బు వచ్చి పడుతుందికదా!అని వాపోయారు.

మూడు రోజులు గవర్నరుతో సమావేశం వేశారు. అంతా విని ఆయన తెల్లమొహం వేశారు. ఇన్ని ఉత్తరాలు రాసినవాళ్ళు అన్ని ఓట్లేసి మళ్ళీ అధికార పార్టీనే గెలిపిస్తే ఎంచక్కా మళ్ళీ ఏ రాష్ట్రానికో గవర్నర్‌ని వేస్తారు కదా!" అని ఆనందించి సి.ఎమ్.ను పిలిచి అతని నెత్తిన దరువు వేశారు.

పరిశీలిక బృందం వారి ప్రవర్తనకు విస్తుపోతూ ఎవరికీ చెప్పకుండా సిటీని పరిశీలించడానికి బయలుదేరారు. కనబడిన రోడ్లన్నీ తిరిగి తిరిగి చివరకు విషయం గ్రహించి ఆనందంతో గంతులేస్తూ ఒడల్ని బాదుకుంటూ వెంటనే ఢిల్లీ ప్రయాణమయ్యారు.

వెంటనే రాష్ట్రపతి, ప్రధాని సమావేశమయ్యారు.

పరిశీలక బృందం తాము హైదరాబాద్ పర్యటనతో మందులు విందులతో విందులు చేసుకున్న వైనం దాచేసి వాళ్ళు గ్రహించిన సంగతిని రిపోర్ట్‌ను అందించారు.

"హైదరాబాద్‌కు రాష్ట్రపతికానీ, ప్రధాన మంత్రి కానీ వచ్చి ఎంచక్కా ఒకటి రెండు రోడ్లు తిరుగుతారు. ఆ రోడ్లు మాత్రం చాల చక్కగా గుంటలు లేకుండా కొత్తగా రోడ్డు వేస్తారు. మిగతా నగర రోడ్లు ఎంత అపరిశుభ్రంగా గోతులమయమయినా పట్టించుకోరు. సిటీ అంతా చెత్తా చెదారం పేరుకొని మురికి వాసన కొడుతున్నది. మంత్రులు తిరగే రోడ్లు నెలకొకసారి బాగు చేసి, రోజుకొక సారి శుభ్రం చేస్తారు. మిగతా సిటీ మాత్రం ఆరు సంవత్సరాలకొకసారి రోడ్లు వేస్తే, రోడ్లేసిన వారం రోజులలోనే టెలిఫోన్ మున్సిపాలిటీ వాళ్ళు గోతులు తవ్వి నాశనం చేస్తారు.

మీరు జనం కోసం ఏమి చేయరు. కాబట్టే మీరు వస్తే వచ్చి ప్రతివీధి తిరిగితే కనీసం రోడ్లు బాగవుతాయి. భయంకరమైన కంపునుండి కాస్త ఉపశమనం కలుగుతుంది. ఇలా చేయని పక్షంలో ఇలా రోజు లక్షలాది ఉత్తరాల వర్షం కురుస్తునే వుంటుందని హెచ్చరిక".

అంతావిన్న ప్రధాని, రాష్ట్రపతి గార్లు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఎందుకంటే ఎవరి మొహం వారికి కనిపించదు కాబట్టి.

బాడీగార్డు లిద్దరు గుద్దుకుందామని ప్రయత్నించి, ఇదేదో సీరియస్ మేటర్ అనుకుని ఆ ప్రయత్నంను విరమించుకున్నారు.

రాష్ట్రపతి ప్రధాని గార్లకు క్షమాపణలతో — రచయిత.

(ఈ కథను చదివి మీరు కూడా చంకలు గుద్దుకోవాలని వుందా? అందుకు నా అనుమతి కావాలండోయ్ మరి, అనుమతి కోసం రాయండి. మహర్షి, 38, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి, నాగార్జున హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్— 482